# అభిరుచులు

రచన :
"పుష్యమి".

(గత సంచిక తరువాయి)

రఘు ఆపడుకూడా స్కూలులో పాటలు పోటీలో మొదటి బహుమతి సరపాదించాడు! రఘు సన్నని కంఠస్వరం పైకెత్తి పాడుతూంటే, రత్తమ్మా, హనుమంతరావూ, మైమరచిపోతూంటారు. నానాటికీ అతనికంఠం తియనిస్వరంతో, మధురంగా తయారవుతోంది!

'అదే నేనూ ఆలోచిస్తున్నాను!' అన్నాడు హనుమంతరావు!

సంవత్సరం పూర్తిగా గడచిపోయింది!

రఘు థర్డుఫారంలోకి వచ్చాడు! —

అక్కడ రవికూడా ఫోర్తుఫారం పాసయాడు!

ఆ సంవత్సరం పరీక్షలలో అన్నింటిలోనూ రఘుకే ఫస్టుమార్కులొచ్చాయి!

'చాలా చురుకైనవాడండీ మీ రఘు!' అన్నాడు రఘు మాష్టారు! హనుమంతరావు ఆనందంలో మునిగిపోయాడు!

ఈ యిద్దరు కొడుకులూ తనకి కాక;—ఏ ధనిక కుటుంబంలోనో పుట్టివుంటే, వారి తెలివితేటలు యింకా ఎంతో అభివృద్ధి చెందే అవకాశంకలుగును!—తానే ధనికుడైతే!...ఏమో!—ఈ యిద్దరూ మొద్దులుగానే పుడుదురేమో!—లక్ష్మీ, సరస్వతులు ఒక చోటవుండరుగా!!—వారి అభిరుచులు అభివృద్ధికి తానెలా న్యాయం చేకూర్చగలనా అనే అతని నిత్యఆలోచన!

ఆరోజు తెల్లవారి ఎనిమిది కావస్తోంది! రఘు అరుగు మీదకూర్చుని, తెలుగు పుస్తకంలో పద్యాలు సంగీతం పాడినట్లు చదువుతున్నాడు! హనుమంతరావు కొట్లోకి వెళ్లే ప్రయత్నంలో వున్నాడు! రత్తమ్మ అప్పుడే లోపల రెండోసారి కాఫీ సేవిస్తోంది! తెల్లవారగానే ఓసారి తాగినా; కాస్త పొద్దెక్కేసరికి నీరసంవస్తోందట! వంట చేసే ఓపిక పోతోందట! అందుకని, ఈమధ్య ఎనిమిది గంటలయాక మరోమారు కాఫీ తాగడం మొదలెట్టింది!

ఆ ఒక్కసారి తాగటంకూడా మానేద్దామని అనుకుంటున్నాడు హనుమంతరావు ఖర్చు భరించలేక! అతనింకా అనుకోడంలోనే ఉన్నాడు! ఈలోగానే రెండోసారి తాగడం మొదలెట్టింది రత్తమ్మ! వద్దు!—అంటే, 'వంట నే చెయ్యలే'నని మూతి ముడుచుకుని, మంచమెక్కి పడుక్కుంటుంది అలిగి! అందుకే నోరెత్తక ఊరుకున్నాడు! యింట్లో భోజనానికయే ఖర్చుకంటె, కాఫీ ఖర్చు ఎక్కువై పోతోంది! రోజువిడిచి రోజు పాతికపౌను కాఫీపొడిపొట్లం తేవలసిందే!

రఘుకి ఈ కాఫీ బాధలేదు! హాయిగా లేవగానే, చద్దెన్నం తినేసి, అరుగుమీద పుస్తకాలిప్పుకుని కూర్చుంటాడు! రత్తమ్మ తన లోటులేకుండా, రఘుకి అలవాటు చేయడానికి ప్రయత్నించిందిపాపం! రఘుకి ఆ కాఫీవాసన కిట్టక, దగ్గిరికి చేరనివ్వలేదు! అసలు కాఫీకంటె చద్దెన్నం అంత ఆరోగ్యం మరోటిలేదు!

లోపలికి చూసిన హనుమంతరావుకి, రత్తమ్మ కాఫీ తాగుతూ కనిపించింది! బాధగా నిట్టూర్చి, బయటికి వచ్చేశాడు!

గుమ్మాలు దిగబోతూంటే, ఎవరో ఒకాయన, నవ్వుతూ ఆవైపే వస్తున్నాడు!

'ఎక్కడో చూసినమనిషిలా ఉన్నాడు?' అనుకున్నాడు హనుమంతరావు!

చేతిలో సంచీతోవచ్చిన ఆ వ్యక్తి హనుమకతరావు ముందు ఆగాడు.

'జ్ఞాపకంవున్నానాహనుమంతరావ్?'అనడిగాడాయన!

హనుమంతరావు ఆయనకేసి అలాగా చూస్తూ, 'గుర్తు రాలేదు! కాని...ఎక్కడో చూచిన...'

'మర్చిపోయావన్నమాట!... నేనయ్యా!...శీతారామశర్మని!'

'ఆఁ!—ఏదో భగవంతుని దయవల్ల, మీలాటి పెద్దల ఆశీర్వాదబలంవల్ల, బాగానే ఉన్నాం! రండి లోపలికి! నిలబెట్టే మాటాడేస్తున్నాను!' అని ఆయన్ని లోపలికి తీసుకువచ్చి, కుర్చీవేసి కూర్చోపెట్టాడు హనుమంతరావు!

ఆ వచ్చినదెవరా?—అని, గుడ్లు అప్పగించి లోపల నుంచిచూస్తోంది రత్తమ్మ!

శీతారామశర్మ, హనుమంతరావుకి ఓ వేలువిడిచిన మేనమామ! నలభైపయినే వుంటుంది వయసు! అసలు తన కూతుర్ని హనుమంతరావు కిచ్చి పెళ్లిచేద్దామనుకున్నాడు! ఆస్థిపాస్తులేమీ లేవని, ఆ ప్రయత్నం మానేశాడు!

ఫోన్ నెం: 54. (స్థాపితము 1936) తంతి; "కారొనేషన్"

# కారొనేషన్ లిథో వర్క్స్

"ధర్మవిల్లా బిల్డింగ్స్"

పోస్ట్ బాక్స్ నెం: 2 :: శివకాశి.

మల్టీ కలర్ కాలెండర్లు, ట్రేడ్ లేబుల్సూ, ఎక్స్ట్రాక్రోమ్, కలర్ ట్రాన్స్ పరెన్సీలు (కాలండర్లకి) అన్నిరకముల్తైన ప్రింటింగ్ పనులూ చేయుటలో చాలా అనుభవజ్ఞులు.

మా పనితనము ఒకసారి చూడండి - వివరములకు వ్రాయండి.

కట్నంయిచ్చి, పరాయి సంబంధం చేసిన శర్మకూతురు కాపురం అధ్వాన్నంగా ఉందిపుడు. ఆ స్తిఉందికదాఅని, అడిగిన కట్నం యిచ్చి చేశాడు! సుఖపడుతుందని! డబ్బుతో పెళ్లికొడుకునంటే కొనగలిగాడు, కాని, కూతురుకి సౌఖ్యం మాత్రం ఆడబ్బుతో కొనలేకపోయాడు! శర్మ అల్లుడు ఓ తాగుబోతు! తాగొచ్చి పెళ్లాన్ని కుళ్లపొడుస్తూంటాడు!

'హనుమంతరావుతో పెళ్లి చేస్తుంటే, సుఖపడుతుందేదేమో!' అని యిప్పటికీ అనుకుంటూంటాడు శర్మ!

శర్మ హరికథలుచెప్పడం చిన్నతనంలో సరదాగా నేర్చుకున్నాడు! హరికథలు చెప్పుకునే బ్రతకాలన్న బాధ అతనికిలేదు! తినటానికి కొద్దిపాటి పిత్రార్జితంఉంది! డబ్బుకోసం కాకపోయినా, హరికథచెప్పటం, అదిఒక ఆనందం అతనికి! యిప్పుడు వయసుమీరినా; యింకా ఆ కంఠంలో బిగి తగ్గలేదు!! కంఠమెత్తి కథచెబుతూంటే, కూర్చున్న పడచు లేవదు సరికదా; తెల్లవార్లూ కూర్చోని వింటుంది! అంతమధురంగా చెపుతాడు శర్మ హరికథ!

'ఏవిటిలా మా ఊరొచ్చారు?' అనడిగాడు హనుమంతరావు.

'గుప్తగారింట్లో వారమ్మాయి పెళ్లికదుటోయ్? నన్ను హరికథ చెప్పమంటూ, ఆయనే పనికట్టుకువచ్చి బలవంతం చేసాడు! యిదివరకున్న ఓపిక యిప్పుడులేకపోయినా, ఆయన పట్టుమీద రాకతప్పలేదు!'

అవును! ఈ తెల్లవారకట్లే అనుకుంటూ! కదూ?...

'అవును తెల్లవారకట్ల అయిదింటికి!'

'మరి మీ హరికతెప్పుడు?'

'ఈ రాత్రే! ఏ ఎనిమిదింటికో మొదలుపెడతాం!' అన్నాడు శర్మ!

శర్మ ఆపూట హనుమంతరావింట్లోనే భోంచేసాడు! భోజనం అయాక, పిచ్చాపాటి మాట్లాడుకోడంలో, రఘునిగూర్చి ఆయనతో చెప్పాడు హనుమంతరావు!

'వాడికంఠం నిజంగా ఎంతో మధురంగావుంటుందండి! వాడికి సంగీతం నేర్పించమని అందరిపట్టాను! కాని, అటే కూదరటంలేదు!' హనుమంతరావు తన పత్ని

స్థితి ఆయనతో పూర్తిగా చెప్పాడు! రఘుకి తాను ఎలా న్యాయంచేకూర్చాలో తెలవడంలేదని వాపోయాడు!

రఘు బడిలోకిపోయాడా సమయానికి! హనుమంతరావు చెప్పినదివిని, అతన్ని కూకలేసాడుశర్మ!

'అటువంటి విషయంఉంటే నాకింతవరకూ ఎందుకు కబురుచెయ్యలేదు? నాకు కాస్త ఉత్తరం వ్రాస్తే ఏమోయ్?—సరే! సాయంత్రం వాణ్ణిరానీ! ఆలోచిద్దాం' అన్నాడు!

సాయంకాలం రఘు బడినించివచ్చాక శర్మ పిలిచి, నువ్వు బాగా పాడతావటగా? ఏది! ఓ పాటపాడు!! అనడిగాడు! రఘుకి భయంవేసింది! ఆయనెదురుగా పాడటానికి సిగ్గేసింది! ఎవరికేనా అంతే! పిల్లలకి 'పాడరా' అంటే సిగ్గుముంచుకొస్తుంది! లేకపోతే యింటిమీద పెంకులు ఎగిరిపోయేలా పాడతారు! ఎవరూ లేనపుడు!

'పరవాలేదు పాడరా!' అని ధైర్యం చెప్పింది రత్తమ్మ!

'నాకు సినిమాపాటలొచ్చండి!' అన్నాడు రఘు!

'ఏవయితే ఏరా? యిప్పుడు కావలసినవే అవిగా లోకానికి! మా హరికథలుకూడా, సినిమా పాటలవరసలో చేప్తేనే ప్రజలువినే పరిస్థితికివచ్చారు! ఆ సినిమా పాటలకే యిప్పుడెక్కువ విలువ! పాడు! ఫరవాలేదు!' అని, రఘుని దగ్గరగా తీసుకుని, వీపు చరిచ్చాడు శర్మ. అసలు రఘు కంఠంవిందామని అయన ఉద్దేశ్యం!

ధైర్యం చిక్కబట్టి ఓపాట పాడాడురఘు! అయినా, రఘుకంఠం కొంచం వణికింది! ఆ వణుకుపాటకి కొత్త అందాన్నిచ్చింది!

శర్మ పాటవిని, 'బాగుందిరా! వృద్ధిలోకి వస్తావు!, అని తట్టాడు. రఘు సిగ్గుతో పారిపోయాడక్కడనించి!

ఆ సాయంత్రం శర్మ అసలు భోజనం చేయలేదు. హరికథ ఉన్నరోజు రాత్రి భోజనంచేయడాయన! పాలు తాగి ఊరుకుంటాడు!

ఆ రాత్రి హరికథకి రత్తమ్మా, హనుమంతరావూ కూడా రఘుని తీసుకువెళ్లారు వినడానికి!

శర్మగారు కథ చేపుతూంటే ముసలివ్యక్తి చెపుతున్నట్టులేదు! ఆకంఠంలో గాంభీర్యం!—మాధుర్యం!—కథ చెప్పలేరూ;—నిజంగా ఓయువకుడులాగే ఉత్సాహంతో గంతువేస్తూ చెపుతున్నాడు కథ! ఆయన ప్రజ్ఞ్యానికి ఆశ్చర్యపోయాడు హనుమంతరావు!

"ఎంతబాగా చెప్పాడు!" అంది రత్నమ్మ, నాటకాలంటే కిట్టవుగాని, హరికథలంటే చెవికోసుకుంటుందామె! ఎంతో శ్రద్ధగావుంది.

ఆయనకథ చెప్పుతున్నంతసేపూ, లీనమైవిన్నాడు రఘు! "నేకూడా నేర్చుకుంటే బాగుండును" అనుకున్నాడు. హరికథమీద మోజు కలిగింది.

మర్నాడు శర్మ వెళ్లడానికి ముందు, హనుమంతరావుని పిల్చి; "ఏమయ్యా! మీరఘు ఎవరిచేతులోనయినా తరిఫీదుపొందితే చాలా వృద్ధిలోకి వస్తాడు! నిన్న విన్నాను వాడిపాట!" అన్నాడు!

"అలాగా! విన్నారా?"

"ఆఁ!... ఈహరికథ ఎవరికేనా కాస్త మంచి కంఠం ఉన్నవాళ్ళకి నేర్పాలని కోరికే! ఆకోరికకోరికలాగే నిలిచిపోయింది! ఎక్కడ చూచినా గారభ స్వరాలే ఎదురవుతున్నాయి! పోనీ మా అబ్బాయికి నేర్పుదామా అంటే!-వాడో మట్టిబుర్ర! వాణ్ణి బేసిక్ ట్రయినింగ్ కి పంపాను! మీ రఘుని చూచి, వాడిపాట విన్నాక, ఆశయం ఈనాటికి ఫలించిందా? - అనిపించింది! ఇప్పటినించీ వీడికి తరిఫీదిస్తే, తప్పక గొప్ప కీర్తి సంపాదిస్తాడు! నా పేరు నిలబెడతాడు!" అన్నాడు శర్మ.

హనుమంతరావు ఆలోచనలో పడ్డాడు! రఘుని శర్మతో హరికథ నేర్చుకోడానికి పంపుతే చదువు పాడయిపోతుందేమోనని ఈ ధర్మసంకటం కూడా పూర్తిగా కుండా ఎలాగా?-అనుకున్నాడు.

"హనుమంతరావ్! మీరు అడగటం మాట అటుంచి నేనేమిమ్మల్ని అడుగుతున్నాను! రఘుని నాతో పంపండి! వాడు వృద్ధిలోకిరావాలీ అని మీరు కోరితే వాణ్ని నాతో పంపండి! వాడి శక్తుల్ని యిలా నాశనం చెయ్యవద్దు? వాడికెంతో మంచి భవిష్యత్తు వుంది!" అన్నాడు తిరిగిశర్మ!

హనుమంతరావు అలాగే తలవంచుకుని కూర్చున్నాడు! ఏ నిర్ణయానికిరావాలో తనలో తనే సమాధానపడలేకపోతున్నాడు! రఘుని ఆయనతో పంపటమా?-మానటమా?...రత్నమ్మ రఘుని విడిచివుండగలదా?

(తరువాయి 65వ పేజీలో)

(52వ పేజీ తరువాయి)

తనంతటతాను తీసుకెడతాననే శర్మతో పంపకపోతే, తానింతవరకూ ఎదురు చూస్తున్న అవకాశం చేతులారా జారవిడచినట్టే!

"రఘు చదువువిషయం ఆలోచిస్తున్నానండి!" అనాడు హనుమంతరావు ఆయనకేసి చూస్తూ!

"అసలా ఆలోచన ఎందుకొచ్చిందయ్యా! రఘుని నాతో తీసుకెడితే, చదువు ఆగిపోతుందనా? అక్కడ నేను చదివించనూ? రఘుకి ఏలోటూ రానియ్యను! నాకా ఉన్నది ఒక్క కొడుకు! వాడూ యిప్పుడక్కడ లేడు! రఘుని నాకొడుక్కంటె ఎక్కువగా చూసుకుంటాను! సరా?..."

"ఇదంతా మీకు శ్రమకాదూ?"

"శ్రమా? ఒకకళాకారుణ్ని వృద్ధిలోకి తీసుకువచ్చే ప్రయత్నంలో, నాకున్న ఎస్టేటేమీ కరగిపోదులే! రఘూవిషయం పూర్తిగా నాకు వదలి, నిశ్చలమైన మనసుతో, నాతో పంపండి! రఘు మీకూ నాకూ కూడా కీర్తి తెచ్చేకళాకారుణ్ని చేస్తాను!"

హనుమంతరావు "రత్నమ్మ ఏమంటుందో? ఆమె ఉద్దేశ్యమేమిటో!" అనిసంశయించాడు!

"ఆయనంతగా చెప్పుతుంటే పంపటానికి ఆలోచిస్తారేం? అనురాగాలకోసం వాణ్ని నాశనం చెస్తామా? ఆలోచించకరఘుని ఆయనతో పంపండి!" అంది లోపలిగుమ్మంలో వున్న రత్నమ్మ! రత్నమ్మకేసి ఓసారి చూచాడు హనుమంతారావు.

"సరే! తీసుకువెళ్ళండి! వాడెక్కడున్నా, వృద్ధిలోకి రావాలనే నాకోరిక!" అన్నాడు!

"రఘూని గూర్చి మీరిక చింతించవలసిన పనిలేదు! మీకంటె జాగ్రత్తగా చూచుకుంటాను!" అన్నాడు శర్మ!

తనతో కూడా రఘుని తీసుకుపోయాడు!

* * *

రఘూకూడా యింట్లోంచి వెళ్లిపోయాక, యిల్లంతా చిన్నబోయింది! ఏదోలోటు ఆవరించింది!

హనుమంతరావు, కన్న కొడుకిద్దరికీ యిలా దూరంగా వుండవలసి వచ్చినందుకు కమిలిపోయాడు!

"పోనీలే! వాళ్ళెక్కడుంటే యేం? ఎక్కడున్నా తనకొడుకులే! వాళ్లు పెద్దవారై, వృద్ధిలోకిరావాలి!- అదేతను కాంక్షించేది!" హనుమంతరావు బలవంతాన గుండెనిబవు చేసుకున్నాడు!...సంతృప్తి జెందాడు.

యిద్దరి కొడుకుల ఎడబాటుకు హృదయం ఆక్రోశించినా, వారి జీవితాలకి మెరుగుదిద్ద బడుతోంది కదా! వారికళలు వెలుగులోకి వస్తాయి!-అనే సంతృప్తి వారిని విడచివుండటానికి ధైర్యాన్నిచ్చింది!

రఘుని శర్మతో పంపమని చెప్పిన రత్నమ్మ మనసు, ఇప్పుడు ఆరాటపడుతోంది! రవివెళ్ళిన నాడుకూడా ఆమె అంతగా బాధపడలేదు! అప్పటికి రఘు తనదగ్గిరుండడమే అందుకు కారణం! కాని ఇప్పుడు రఘు కూడా చేరువను లేకపోయేసరికి, ఆమెలో సంచలనం కలిగింది!

"వెర్రివెధవ! ఎలా వున్నాడో! ఏమో! ఎప్పుడూ విడచివుండలేదు!" అనుకుంటూ ఉంది. రఘు జ్ఞాపకం వచ్చినపుడల్లా!

ఉన్న కొడుకులిద్దరిలోనూ, ఎవరొకరూ దగ్గరలేక పోయేసరికి ఆమెలో గొప్ప మార్పు వచ్చింది! ఇప్పుడు రఘుతోపాటు రవికూడా ఆమె మనసులో తరచు మెదులుతున్నాడు! ఆమెవైఖరిలో గొప్ప పరివర్తన కలిగింది! యింటి పరిస్థితులు అర్థమయాయి! - అంటే, అంతకు పూర్వం అర్థంకాకకాదు!...అసలామె అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తేగా?...ఇంతదాకా ఆమె జీవితం, ఆమెకే తెలియనిపంథాలో నడిచింది! ఇప్పుడామెలో, నిద్రిస్తూన్న జ్ఞానం మేల్కొంది!

"రవి అంటే నాకు అంతకోపంగా వుండేదేం? వాడేంచేసినా, వాడేదిమాట్లాడినా నా మనసుకు వ్యతిరేకంగానే తోచేది! పాపం! రవి, సంసారపరిస్థితి అర్థంచేసుకున్నాడు! కనకే, మామయ్యతో మాటాడకుండా వెళ్ళాడు!...ఎలా ఉన్నాడో?"

ఇప్పుడామె హృదయంలో రవికీ, రఘూకే సమాన స్థానాలు లభించాయి!

ఆమె మాటలలో, ప్రవర్తనలో కలిగిన మార్పు చూచి ఆశ్చర్యపోయాడు హనుమంతరావు! ప్రపంచమంతా ఆనందంతో చప్పట్లు కొట్టినట్లుంది! రత్నమ్మ

మారిందంటే అతని హృదయం చల్లబడింది! రత్నమ్మలో మార్పు సంసార పరిస్థితి చక్కబడటానికెంతో సహకరించింది!

హనుమంతరావు అప్పులు ఒక్కొక్కటే తీర్చసాగాడు! సర్వశక్తుల్నీ కూడాదీసి, పొదుపు ఉద్యమం' పాటిస్తూ, అతనికి సహాయకారిగా వుంది రత్నమ్మ!

ఓ నెలలో రఘూనీ, ఓ నెలలో రవినీ చూచివస్తున్నాడు హనుమంతరావు!

ఆరు నెలలుగడిచాక, రఘూనిఓసారితీసుకు వచ్చాడు! రఘూని తీసుకువచ్చాక-

''రవిని కూడా తీసుకురండీ! చూడాలని వుంది!'' అంది రత్నమ్మ! ఆమెరవిని చూడాలనీ, తీసుకు రమ్మనీ అంటే, అంతకంటే ఆనందం ఇంకేంవుంది?—వెళ్ళి రవిని కూడా తీసుకువచ్చాడు!

రవీ, రఘూ నాలుగు రోజులున్నారు! ఆ నాలుగు రోజులూ నాలుగు నిముషాలులా గడిచినట్లయింది రత్నమ్మకి!

''బాబూ! రవీ! బాగా చదువుకో నాయనా!- అప్పుడు నాలుకాలు వేయదాల్చున్నానని కోపం వచ్చింది కదూ? నీచదువు పాడయిపోతుందనే అలా అన్నారా! నువ్వు ఏంచేసినా, చదువు విషయంలో శ్రద్ధగా ఉంటే నాకంటే చాలు! మీరు వుండేది పొరుగుచోటు, వాళ్ల మనసుకి నొప్పి కలగకుండా నడుచుకోవాలి! ఈ రోజుల్లో యిలా ఆదుకుని, చేరదీసి, అభివృద్ధికోరేవారెవరుంటారు? మీరు అదృష్టవంతులు కనక యిలా కలిసి వచ్చిందికాలం! కాని, ఒకటి గుర్తుంచుకోండి! యిలా ఆపత్ సమయంలో ఆదుకుని చేరదీసిన వారికి మనమెంతో ఋణపడి వుంటామని మర్చిపోవద్దు!...చదువు విషయంలో మాత్రం జాగ్రత్త!'' అంటూ, రవితల ప్రేమగా నిమిరింది రత్నమ్మ! దగ్గరగా తీసుకుంది! ఆమెముఖులలో చూచాడు రవి! ఆమె రెండుకళ్లూ జలపూరితాలయాయి. ఆమెకి తనపట్లకల అనురాగం ఆ అశ్రుపూరిత నయనాలలో కనిపిస్తూంది!

''అమ్మా! ఏమిటమ్మా అది?''

''రవీ! మిమ్మల్ని విడిచి వుండలేకపోతున్నారా! మీకు దూరంగా వుండటం నాకు చాలా కష్టంగా వుంది!''

''ఎందుకమ్మా! యిక పైనుంచీ, ప్రతినెలా వస్తూంటాంలే అమ్మా! బెంగ ఎందుకమ్మా?''

''వెర్రివాడా! నీవు నాకు కనపడనీయకుండా, నాకు ధైర్యం చెపుతున్నావా? కాని, రవీ! మనకీ ఎటబాటు కొంతకాలంపాటు తప్పదు! ఫరవాలేదులే! ఏదో! మిమ్మల్ని చూస్తే ఆపుకోలేక దుఃఖంవస్తుంది, కాని! నాకు బెంగలేదురా! అక్కడమీరిద్దరూసుఖంగా వున్నప్పుడు ఎందుకురా నాకు బెంగ?'' అంది రత్నమ్మ, తడిసినకళ్ళను కొంగుతో తుడుచుకుంటూ!




శ్రీ కృష్ణా ఐరన్ వర్క్సు

తపాలు పెట్టె నెం. 103, మధురై.

మేము కట్టడములకు కావలసిన ఇనుము సామానులను తయారు చేయుదుము. స్ప్రింగు తలుపులు, కాంపౌండు తలుపులు, క్రొత్తరకాల కిటికీలు వెంటిలేటర్లు గ్రాదులు ఇనుము ట్రస్సులు, అద్దము కిటికీలు మొదలైన మా సామానులు ప్రసిద్ధిచెందినవి. 1925 సం॥ నుండి మునిసిపాలిటిలు, జిల్లాబోర్డులు, P. W. D. హైవేస్, పంచాయితీ బోర్డులు మొదలైన వారికి కావలసిన సామానులను తృప్తికరముగా సప్లయి చేయుచున్నాము.



టెలిగ్రామ్స్: "IRONGATES" ఫోను: 725

Leading Printers of Quality.....

*Contact for your Requirements of :—*

**Readymade Photo Offset Calendars, in Verious, Cine-Religious, Scenery, and Baby Designs.**

**CHIDAMBARAM LITHO PRESS**

[ Tel : "VEESEE" — Post Box No 43. — Phone No : 49. ]

**SIVAKASI (S.I.)**

రవి తనకన్నీరు ఆమెకు కనపడకుండా తుడిచేశాడు!

తనకి తెలిసిననాటినించీ తనని ఆప్యాయంగా, ప్రేమతో ఆమె తనని చేరదీసిన మొదటిదినాలు యివే! తనపట్ల ఆమెకు యింత కాలానికి కలిగిన ప్రేమాభిమానాలకి అచ్చెరువొందలేదు రవి! తల్లి హృదయం తల్లి హృదయమే! ఆమె హృదయంలో దాగిఉన్న మాతృప్రేమ ఒకనాడు కాకపోతే, మరొకనాడయినా వెలుగులోకి రాకమానదు! ఎంత కఠినహృదయమైనా, ఏదో ఒక సంఘటనద్వారా పరివర్తన చెందక మానదు. తల్లి హృదయంలో యింత ప్రేమ దాగివుండి కూడా, పరిసర ప్రభావంవల్ల, పైకి రాలేదు! పరిసరం అంటే; ఆ యిల్లు చెడుపరిసరం అని కాదు! ఆ పరిసరానికి అనుగుణంగా నడుచుకోలేకపోయింది ఆమే! అందుకు ఆమె మనశ్శక్తులయొక్క బలహీనతే కారణం!!

యిప్పటికయినా ఆమెలో రవిపట్ల ప్రేమ ఉబికిందంటే!-అది మాతృహృదయానికి సహజం!!

రవీ, రఘూ తిరిగి వెళ్ళిపోయారు!

రత్తమ్మ హృదయం ఆవేదనతో ఆక్రోశించింది! రవీ, రఘూ ఆ యింటిని వదలిపోయే తొలిదినాలనాడు లేని ఆరాటం, ఆవేదనా, ఈనాడు తలెత్తాయి!

కళ్ళనిండా నీళ్ళతో, బాధగా, యిద్దరినీ సాగనంపింది!

యిలా, ఎడబాటుతోనే, అనురాగాలు పటిష్టమవుతాయి.

రఘు తర్డుఫారం పాసయేనాటికి, శర్మ అతనికి హరికథలో బాగా తరఫీదుయిచ్చాడు.

రఘుచేత మొదటిసారిగా, స్కూలు వార్షికోత్సవంలో హరికథ చెప్పించాడు!

రఘులోని సహజశక్తి, నైపుణ్యం; శర్మ తరిఫీదులో యింకా ప్రకాశించాయి! పధ్నాలుగేళ్ళ రఘు, ఛలాకీగా, మధురంగా హరికథ చెప్పడం చూచి, హరికథ అంటే ఈసడించే నవనాగరికులంతా రఘుచేత మరొక్కసారి కథ చెప్పించమని కోరారు! కాని, శర్మ నిరాకరించాడు!

'రఘుని పరిపూర్ణుణ్ణి చేసి, వచ్చే విజయదశమి ఉత్సవాలలోనే తిరిగి అతనిచేత కథ చెప్పించ దలుచుకున్నాను!' అని చెప్పాడు!

**కథాంజలి**

[చక్కని కథల మాసపత్రిక]

స్థాపితం. 1938.

| | |
|---|---|
| విడి ప్రతి — | 25 న. పై. |
| సంవత్సర చందా — | రూ. 4-00. |

(ప్రత్యేక సంచికలతో సహా.)

అన్ని హిగ్గిన్ బాథమ్స్, స్వదేశమిత్రన్ బుక్ స్టాల్సులలోనూ దొరుకును.

తిరిగి రఘుకి మెరుగుపెట్టసాగాడు!

రఘుకి పాటలంటే వున్న సహజానురక్తి; లయజ్ఞానం; శర్మ ప్రయత్నానికి మరింత తోడ్పడ్డాయి! ఏ విషయాన్నయినా, చెప్పగానే గ్రహించి; యిట్టే పట్టుకుని సాధనచేసే పట్టుదలా, ప్రతిభా అతనిలో ఉన్నాయి ఆదే శర్మ ప్రయత్నానికి ప్రయాస లేకుండా చేసింది!

ఓనాడు శర్మ రఘుతో అన్నాడు—

'రఘూ! యిది సినిమా ప్రపంచం! ఈ వర్తమాన కాలం చాలా అయోమయంగా తయారయింది! హరికథలంటే ప్రజలో పూర్వవున్న అభిమానం, ఆదరణా నశించాయి! తెరమీద బొమ్మల్ని చూచి భ్రమపడే యిప్పటి సినిమా ప్రజానీకానికి, హరిదాసు చెప్పే భక్తవాక్యాలు, కషాయంలాగా, కఠోరంగానూ వున్నాయి!

అటువంటి ప్రజలలో నవచైతన్యాన్ని తెచ్చి, హరికథలకి తిరిగి వాటి యధార్థస్థితి కల్పిస్తావని నాకు బాగా నమ్మకముంది! హరిదాసుకు ప్రజలలో పూర్వం వున్న గౌరవాన్ని నీ ప్రతిభతో నిలబెట్టాలి! అందుకు బాగా కృషి చేయాలి! నా పేరు నిలబెట్టాలి! నీకు కీర్తి సంపాదించుకోవాలి! రేపు వచ్చే నవరాత్రి ఉత్సవాలలో తిరిగి నిన్ను ప్రజల ముందుకూ, పెద్దల ఎదుటికి పంపదల్చుకున్నాను! ఆ అవకాశాన్ని జారవిడువక, నీ కళ ప్రదర్శించు! ఈ కళకు పేరు నిలబెట్టు!-అదే నేను నీ మంచి ఆశించేది!' అని, తన ఆశయాన్ని, రఘుకి విప్పి చెప్పాడు శర్మ' తనకీ, తనకళకే తప్పక న్యాయం చేకూరుస్తాడనే గట్టినమ్మకం రఘుమీద వుంది శర్మకి!

రఘు నవరాత్రి ఉత్సవాలలో రెండవసారిగా హరికథ చెప్పాడు ఆ ఊళ్ళోనే! వట్టి చెప్పడమేమిటి?— చాలా అద్భుతంగా చెప్పాడు! చూపరులకు ఆశ్చర్యం కలిగేనైపుణ్యం ప్రదర్శిస్తూ, అమోఘంగా చెప్పాడు!

'పదిహేనేళ్ళయినా నిండని పిన్న వయసులో యింత అద్భుతంగా హరికథ చెప్పడంలో నైపుణ్యాన్ని సంపాదించాడు!-చాలా బాగా చెప్పాడు కథ!!...' అన్న ప్రజల ప్రశంసవాక్యాలే, అతని అభివృద్ధికి ఆశీర్వాదాలయాయి!

మర్నాడు పేపరులో రగు ఫోటో వేసారు! దాని కింద, అతని వయసుకుమించిన ప్రతిభను గూర్చి పొగుడుతూ వ్రాశారు!

(సశేషం)




తన కుటుంబాని కంతకూ...

"ఓవోమాల్ట్"

శ్రేష్ఠమయిన ఆహారమని

ప్రియమైన తల్లికి తెలుసు

★

ఓవోమాల్ట్ లేబరేటరీ.,

సేలం జంక్షన్ సేలం - 5